



టిటిడి చీఫ్ పిఆర్ఓగా తలారి రవి



తిరుపతి సిటీ : టిటిడి చీఫ్ పిఆర్ఓగా ఉద్యోగోన్నతి లభించిన సందర్భంగా తలారి రవి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలనా భవనంలో చీఫ్ పిఆర్ఓగా బాధ్యతలు చేపట్టారు. పద్మావతిపురంలోని ఎంఎల్‌ఎ నివాసం వద్ద ఛైర్మన్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. 15 ఏళ్ల క్రితం భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పిఆర్ఓగా బాధ్యతలు చేపట్టారు. మళ్లీ ఆయన హయాంలోనే చీఫ్ పిఆర్ఓగా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన స్థానంలో పిఆర్ఓగా నీలిమ బాధ్యతలు చేపట్టారు.


సత్యవేడులో అరెస్టులు



తిరుపతిలో జైల్‌భరో ప్రదర్శన

జీతమైనా పెంచండి.. జైల్లోనైనా పెట్టండి..

• కార్మికసంఘాల జైల్‌భరో • జిల్లాలో 2800 మంది అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'చాలీచాలని జీతాలతో ఎన్నాళ్లని అప్పుచేసి, వడ్డీలు కట్టుకుంటూ బతుకు జీవనం సాగించాలి.. మా వల్ల కాదు.. మీరు ఇచ్చిన హామీ మేరకు జీతాలైనా పెంచండి.. లేదంటే జైల్లోనైనా పెట్టండి' అంటూ కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకొచ్చి 'జైల్‌భరో' నిర్వహించాయి. తిరుపతి జిల్లావ్యాప్తంగా భారీ ప్రదర్శనలు, మానవహారాలు,రాస్తారోకోలు నిర్వహించారు. మొత్తం 2,800 మందిని అరెస్టు చేసి, అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అంగన్‌వాడీ మహిళలు ఏడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి భవిష్యత్‌లో ఏడుపే మిగులుతుందని నేతలు ఉద్ఘాటించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతలు కందారపు మురళి, కె.రాధాకృష్ణ, ఆర్.హరికృష్ణ ఆధ్వర్యంలో తిరుపతిలో జైల్‌భరో నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. నాలుగు కాళ్ల మండపం వద్దకు చేరుకునేటప్పటికి పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి ప్రదర్శన నిలిపేయాలని, ముందుకు వెళ్లడానికి వీల్లేదని ఆంక్షలు పెట్టారు. దీంతో కార్మిక సంఘాల నేతలు అక్కడే బైఠాయించారు. అంగన్‌వాడీ మహిళలు పెద్ద సంఖ్యలో ఉండడంతో బందోబస్తుకు వచ్చిన మగ పోలీసులు అరెస్టులకు వెనకడుగు వేశారు. దీంతో కార్మిక సంఘాల నేతలు ప్రదర్శనను కొనసాగించే ప్రయత్నం చేయగాతు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. తక్షణం సిఎం అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల, ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈస్టు పోలీసు స్టేషన్ అంతా అంగన్‌వాడీ మహిళలతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో నేతలు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, చిన్నా, బుజ్జి, బాలాజీ, ఎన్‌డి శ్రీనివాసులు, నాగరాజమ్మ,


చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో

జయప్రభ, ఎల్లమ్మ, గీత, గోమతి, రాధాకృష్ణ, సుబ్రమణ్యం, భారతి, గంగ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో 'జీతాలైనా పెంచండి.. జైల్లోనైనా పెట్టండి' అంటూ అంగన్‌వాడీలు రోడ్డెక్కారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. టూటౌన్ పోలీసులు అంగన్‌వాడీలను అరెస్టు చేసి, సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, పుష్ప, సౌజన్య, స్వర్ణ, సక్కుభాయమ్మ, మురళి పాల్గొన్నారు.
- నాయుడుపేటలో హోటల్ అమరావతి సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మున్సిపల్, అంగన్‌వాడీ కార్మికులు మానవహారం నిర్వహించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని నినదించారు. సమ్మె విరమించాలని పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా నాయకులు వినకపోవడంతో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చాపల వెంకటేశ్వర్లు, శివకవి ముకుంద, శ్యామలమ్మ, గోపాలయ్య పాల్గొన్నారు.
- సత్యవేడులో సమ్మె ఉధృతంగా సాగింది. సిఐటియు డివిజన్ నాయకులు రమేష్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వేతనాలు పెంచకపోతే, ఎన్నికల్లో మహిళా శక్తి చూపిస్తారని హెచ్చరించారు. పోలీసులకు, నాయకులకు మధ్య పెనుగులాట జరిగింది. అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి, సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. మునిరాజు, మురళి, బాష, నిర్మల, భువన, సరళ పాల్గొన్నారు.
- గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎస్.సురేష్, బివి రమణయ్య, జోగిశివకుమార్, ఇంద్రావతి, బిఎస్ ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మీ మణికుమారి పాల్గొన్నారు.
- పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద జైల్‌భరో కార్యక్రమంలో నేతలను అరెస్టు చేశారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు వెంకటేష్, నందయ్య, డి.మహేష్, అంగన్‌వాడీలను అరెస్టు చేశారు.
- రేణిగుంట పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డును అర్ధగంటసేపు దిగ్బంధం చేశారు. దీంతో పోలీసులు నాయకత్వాన్ని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలో మధ్యాహ్నం వరకూ నిరసన తెలపడంతో అరెస్టు చేసిన నాయకులను వదిలేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ఎంపిటిసి రాజేశ్వరి, నాయకులు కరీముల్లా, రంగయ్య, నరసింహారెడ్డి, హరినాథ్, ఒ.వెంకటరమణ, శివానందం, ధనమ్మ, భాగ్యలక్ష్మి, రాధమ్మ, భారతి పాల్గొన్నారు.
- వెంకటగిరిలో అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో జైల్‌భరో నిర్వహించారు. బంగారుపేట నుంచి రాపూర్ క్రాస్ వద్ద రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వీరిని అరెస్టు చేసి సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. వడ్డిపల్లిచెంగయ్య, ఎ.భాస్కర్, ఎ.మంజుల, సుభాషిణి, జయంపు, ఎస్.ప్రసాద్, టి.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.
- చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసినట్లుగా, అంగన్‌వాడీల నుంచి ఓట్లు వేయించుకుని అధికారానికి వచ్చిన అనంతరం పట్టించుకోకపోవడం తీరని ద్రోహమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రియదర్శిని, నాగరాజమ్మ పాల్గొన్నారు.

న(కు)య్..న(కు)య్..!



23 నుంచి సమ్మెలోకి..
108, 104 సిబ్బంది
నాలుగు నెలలుగా జీతాల్లేవ్
రెగ్యులర్ చేయాలన్నది డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి

ఏపీలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఉద్యోగ, కార్మిక వర్గాల సమ్మెలు ఉధృతమవుతున్నాయి.. ప్రభుత్వ హామీలు నెరవేరుతాయని నిరీక్షించిన వీరు సహనం నశించి సమ్మెలోకి దిగుతున్నారు. ఇప్పటికే అంగన్ వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు విధులు బహిష్కరించి రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తుండగా.. ఇప్పుడు వీరితో పాటు 104, 108 అత్యవసర సర్వీసుల ఉద్యోగులు సంక్రాంతి తరువాత సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నాలుగు నెలలుగా జీతాల్లేక అవస్థలు పడుతున్న వీరు, రెగ్యులర్ చేయాలన్నది ప్రధాన డిమాండ్. 'కుయ్‌కుయ్' అంటూ రోగులకు అత్యవసర సేవలు అందిస్తున్న వీరు 'కుయ్యో మొర్రో' అంటూ సమ్మెకు సమాయత్తం అవుతున్నారు. ఈ సమ్మెలన్నీ ప్రభుత్వ స్వయంకృతాపరాధమే కావడం గమనార్హం. ప్రమాదాలు చోటుచేసుకున్నాయని సమాచారం అందిన వెంటనే స్పందించే 108 అంబులెన్సు సిబ్బందికి నేడు జీతాల కష్టాలు ఎదురవుతు న్నాయి.. సకాలంలో వేతనాలు అందక, ఆర్థిక ఇబ్బందులతో వున్న 102, 104, 108 అంబులెన్స్ సిబ్బంది సైతం ఆందోళన బాట పట్టనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 108 అంబులెన్సులు 54 ఉండగా అందులో 200 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 104 అంబులెన్సులో 108 మంది, 102 అంబులెన్సులో 23 మందికి పైగా వున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగులందరికీ నాలుగు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. వీరి జీతాలు కాంట్రాక్టు సంస్థే చెల్లించాలని, ప్రభుత్వ అధికారులు చేతులు దులుపు కుంటుండటం గమనార్హం. కొంతకాలంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అత్యవసర సేవల సిబ్బంది జనవరి 23వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 22లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే 23వ తేదీన సమ్మెలోకి వెళ్లనున్నట్లు 104, 108 సర్వీసుల ఉద్యోగులు తాజాగా ఆరోగ్యశ్రీ సీఈవోకు తమ సమ్మె నోటీసుల్ని అందజేశారు. తమ సమస్యల పరిష్కారం విషయంలో ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే నోటీసులు ఇచ్చినట్లు వారు చెబుతున్నారు. 22 వ తేదీ వరకూ ప్రభుత్వానికి డెడ్ లైన్ పెట్టినా అప్పటి వరకూ నిరసనలు కొనసాగిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకుంటే మాత్రం 23న తప్పనిసరిగా సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవడం గమనార్హం.దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

108 సిబ్బంది సమ్మె నోటీస్



జిల్లా వైద్యాధికారి డాక్టర్ యు. శ్రీహరికి 108 సర్వీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఆయనను కలిసిన 108 సిబ్బంది మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వైద్య విభాగంలో పని చేస్తున్నామన్నారు. 2019లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తమతో చర్చలు జరిపి వేతనాలు పెంచారని,అదే సందర్భంగా తమను కార్పొరేషన్ లో కలుపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు కలపలేదని గుర్తు చేశారు. నూతన పోస్టుల ఖాళీల భర్తీలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం ఈనెల 22వ తేదీలోపు స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 23వ తేదీ నుండి సమ్మెకు వెళతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన డిఎంహెచ్వో మీ సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముని రాజా, జిల్లా కోశాధికారి కన్నప్ప గారి కేశవులు రెడ్డి, ఓ చంద్రబాబు నాయుడు, గోపాల్, నాగరాజు, మనోజ్, జానకిరామ్, చిట్టిబాబు, ప్రసాద్, పాములేటి, ముని చంద్ర పాల్గొన్నారు.




సూళ్లూరుపేటలో భారీ ప్రదర్శన, గూడూరులో మున్సిపల్ కమిషనర్ రాయభారం

సమాన పనికి..సమాన వేతనం ఇవ్వాలి

మున్సిపల్ కమీషనర్ల రాయభారం / ససేమిరా అంటున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్, యంత్రాంగం


గూడూరు పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని, అందరికీ పనిముట్లు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్.సురేష్, బి.రమేష్, ధారా కోటేశ్వరరావు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులతో చర్చలు జరిపారు. పారిశుధ్యం ఇబ్బందిగా ఉందన్నారు. అయితే తమ సమస్యలు పరిష్కరించిన వెంటనే పనుల్లోకి వస్తారని నాయకులు స్పష్టం చేశారు. సమ్మె కొనసాగుతుందన్నారు.

- పుత్తూరు టౌన్‌లో ఏడు రోజులుగా ఎఐటియుసి నాయకులు మహేష్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ మొండివైఖరి వల్లనే సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. నాయకులు గోపి, గణేష్‌కుమార్, చందు, టిడిపి నాయకులు గాలి జీవరత్నం నాయుడు, గంజి మాధవయ్య, యుగంధర్ పాల్గొన్నారు.
- తిరుపతిలో కార్మికులు సమ్మె చేస్తూనే స్వచ్ఛందంగా విధులకు హాజరవుతున్నారని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. వారం రోజులుగా సమ్మె ప్రభావంతో నగరం అంతా చెత్తకుప్పలతో నిండిపోయింది. వర్షం వల్ల కుళ్లి దుర్వాసన వస్తుండడంతో, కోవిడ్, డెంగ్యూ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున కమిషనర్ హరిత ఎఐటియుసి యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. కమిషనర్ హామీతో స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు.
- సూళ్లూరుపేటలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ కార్మికులను, యూనియన్ నాయకులను పిలిపించి రాయభారం నిర్వహించారు. దగ్గరలో పండుగలున్నాయని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని చర్చించారు. అయితే వేతనాలు పెంచేంత వరకూ తగ్గేదే లేదని నాయకులు స్పష్టం చేశారు. బి.పద్మనాభయ్య, కె.సాంబశివయ్య, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

'బోస్'కేనా టిక్కెట్..!

శరవేగంగా 'పలమనేరు' పరిణామాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లిస్టులో పలమనేరు సిట్టింగ్ ఎంఎల్‌ఎ వెంకటేగౌడ లేరు. రెండోసారి జరిపిన సర్వేలో అభ్యర్థిని మార్చకపోతే అధికార పార్టీకి కష్టమేనని నివేదికలు తెలిపాయి. దీంతో రెండో విడత అభ్యర్థుల జాబితాలో మార్పులు జరుగుతున్నాయి. మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆహ్వానం మేరకు వైసిపి తీర్థం పుచ్చుకున్న సుభాష్ చంద్రబోస్ రాజకీయాల్లో స్తబ్ధతగా ఉన్నారు. అయితే పెద్దిరెడ్డి అనుయాయుడు కావడంతో జగన్మోహన్‌రెడ్డికి 'బోస్' కుటుంబ రాజకీయాలను వివరించి అమరనాథ్‌రెడ్డిని ఎదుర్కోవాలంటే బోస్ ఒక్కడే ధీటైన వ్యక్తని చెప్పినట్లు సమాచారం. ఇప్పటికీ సిట్టింగ్ ఎంఎల్‌ఎ వెంకటేగౌడ మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ జగన్ తనకే సీటు వస్తారనే ధీమాతో ఉన్నారు. 2014లో అమరనాథరెడ్డిపై పోటీగా టిడిపి అభ్యర్థిగా నిలబడి ఓటమిని చవిచూశారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బోస్ ఓడిపోయినప్పటికీ పలమనేరు ఇన్‌ఛార్జి బాధ్యతను బోస్‌కే కట్టబెట్టారు. 2014లో అధికారంలోకి రాగానే ఎంఎల్‌ఎల 'ఆకర్ష్' పథకానికి ఆకర్షితుడై టిడిపి తీర్థం పుచ్చుకున్నాడు. బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డికి ఉన్న మంత్రి పదవిని తొలగించి, అమరనాథ్‌రెడ్డికి పరిశ్రమల శాఖ మంత్రిగా కట్టబెట్టారు. ఇన్‌ఛార్జిగా ఉన్న తనకు ఏమాత్రం తెలియజేయకుండా నిర్ణయం తీసుకున్నారన్న 'కోపం' బోస్‌కు ఉంది. దీంతో వైసిపి అధికారంలోకి రాగానే వైఎస్ఆర్ కాంగ్రెస్‌లోకి వెళ్లలేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏడాది క్రితం పెద్దిరెడ్డి ద్వారా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో పలమనేరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా బోస్ నిలబడతారని చర్చ జోరుగా నడుస్తోంది.



టిటిడి ఉద్యోగుల సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టిటిడి వినాయక నగర్ క్వార్టర్స్‌లో ప్రతి సంవత్సరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు మొదటి రోజు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. నాయకులు గోల్కొండ వెంకటేశం, దయాకర్, చొక్కలింగం, మురళి పాల్గొన్నారు.

దొంగోట్లను రద్దు చేయాలని టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి- తిరుపతి

తిరుపతి నగరంలో నమోదైన దొంగ ఓట్లు రద్దు చేయాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్విమ్స్ సర్కిల్ నుంచి టిడిపి శ్రేణులు ర్యాలీ చేపట్టి ఓల్డ్ మెటర్నరీ హాస్పిటల్ మీదుగా తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం వరకు చేరుకున్నారు. అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తిరుపతిలో 40వేలకు పైగా దొంగఓట్లను అధికార పార్టీ నమోదు చేసిందని విమర్శించారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం దొంగ ఓట్ల ఫ్యాక్టరీగా తయారైందని ఎద్దేవ చేశారు. ఇక్కడున్నా ఇద్దరు డిప్యూటీ మేయర్లు దొంగ ఓట్లు చేర్చే పనిలోనే నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. అధికారులు స్పందించి అడ్డుకొని, దొంగ ఓట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, వూకా విజయ్ కుమార్, జె బి శ్రీనివాసులు, నరసింహ యాదవ్, దంపూరి భాస్కర్, ఆర్ సి మునికష్ణ, వినుకొండ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



టిడిపి నిరసన ర్యాలీ


విజయవాడలో యుటిఎఫ్ నాయకుల అరెస్టు

బకాయిలు చెల్లించండి యూటీఎఫ్

తిరుపతి టౌన్ : ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న 20వేల కోట్ల రూపాయల బకాయిలను ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాలని డిమాండ్ చేస్తే విజయవాడలో అరెస్టు చేయడం దారుణమని యుటిఎఫ్ ఓ ప్రకటనలో ఖండించింది. అరెస్టులు చేయడం కంటే ముందు బకాయిలు చెల్లించడానికి కృషి చేయాలని డిమాండ్‌చేశారు. విజయవాడలో జరిగిన ధర్నాలో తిరుపతి జిల్లా నుంచి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్ అరెస్టయ్యారు.



రైల్వే కార్మికుల నిరసన దీక్ష

రైల్వే ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయాలి

రేణిగుంట : రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ వర్కుషాపు డివిజనల్ సెక్రటరీ సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిఆర్ఎ గేటు ముందు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. తమ డిమాండ్ల సాధనకై ఈనెల 8-11 తేదీల్లో రిలే నిరాహారదీక్షలు చేపడతామన్నారు. నూతన పెన్షన్ విధానం వల్ల కార్మికులకు సామాజిక భద్రత లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివరెడ్డి, ఉదయ్‌రాయ్, హెన్రిపాల్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులకు యుటిఎఫ్ సాయం

వరదయ్యపాలెం / తిరుపతి టౌన్: తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు యుటిఎఫ్ ఆర్థికంగా అండగా నిలిచింది. అరకొర జీతాలతో ఇబ్బంది పడుతున్న వారికి మద్దతుగా 36వేల రూపాయలను అందించారు. అండగా నిలిచి ఆర్థికంగా సాయం చేసిన టీచర్లకు యుటిఎఫ్ అధ్యక్షులు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్ కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతిలో సమ్మెలో ఉన్న ఎస్ఎస్ఐ ఉద్యోగులకు ఎస్‌టియు సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు, మురళీకృష్ణ సంఘీభావం తెలిపారు.

రోజాను కలిసిన వీసి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్



ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణ స్వామిని, రాష్ట్ర పర్యాటక ,సాంస్కతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్ కె. రోజాను గౌరవ పూర్వకంగా కలిశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అభివద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు వర్సిటీ అభివద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

త్వరలోనే మీడియా నిజనిర్ధారణ కమిటీ సమగ్ర నివేదిక

తిరుపతి : శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగం వ్యవహారంలో ఆరోపణలు తలెత్తడంపై పరిశీలన కోసం ఏర్పడిన మీడియానిజనిర్ధారణ కమిటీ సమగ్ర నివేదికను త్వరలోనే వెల్లడించనుందని కమిటీ ఛైర్మన్ జె.భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డిని, ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్‌చీఫ్ అకౌంట్ ఆఫీసర్ ఒ.బాలాజీని టిటిడి పరిపాలనా భవనంలో మంగళవారం కలిసారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జి.శ్రీధర్, ఎంపిఆర్ రాజు, ఆదిమూలం శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో చేయి కోల్పోయిన గిరిజనుడు

ప్రజాశక్తి - ఓజిలి



విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఓ గిరిజనుడు విద్యుత్ షాక్‌కు గురై తన చేయిని కోల్పోయాడు. దీంతో ఇంటికి ఆధారమైన పెద్దదిక్కుకు చేయి లేకపోవడంతో ఆ కుటుంబం వీధినపడింది. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నా పట్టించుకునే దిక్కులేదని వారు వాపోతున్నారు.

మండల పరిధిలోని భువనగిరిపాలెం గ్రామానికి చెందిన మాణికల మణి (40) పశువుల కాపరి. ప్రతిరోజూలానే పశువులను మేతకు తీసుకెళుతుండగా ఓడూరు నుంచి చిల్లమానుచేను మీదుగా వెళుతున్న 11 కెవి విద్యుత్ లైన్ కిందకు వేలాడుతూ కనిపించింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వైద్యసేవల కోసం నెల్లూరుకు హుటాహుటిన తరలించగా చేయిభాగం దెబ్బతిందని, కుడిచేయిని తొలగించాలని వైద్యులు తెలిపారు. కుటుంబ పోషణ కోసం వెళ్లి జీవనాధారం కోల్పోయామని సభ్యులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు వేడుకొంటున్నారు. మణికి ఇద్దరు కుమార్తెలు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు శివకవి ముకుంద, చంద్రకళ వారిని పరామర్శించారు. డిస్కం ఉన్నతాధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్‌చేశారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులకు సర్పంచ్ కందాటి మోహన ప్రియ ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకముని, వెల్ఫేర్ అసిస్టెంట్ విష్ణు ప్రియ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రూ.11 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశం మేరకు బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహం ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగలో శ్రీకాళహస్తి- చెన్నై రహదారిపై వాహనాల ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తమిళనాడు నుండి అన్నమయ్య జిల్లాకు వెళుతున్న కారును ఆపి తనిఖీ చేసిన ఎస్ఐకి భారీ మొత్తంలో దాదాపు 11 లక్షల రూపాయలు ఎలాంటి పత్రాలు లేకుండా లేకుండా తీసుకు వెళుతుండడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ పట్టుబడిన నగదును ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో సిబ్బంది ప్రభాకర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జన విజ్ఞాన వేదిక గూడూరు వారి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మూలి కిషోర్ రెడ్డి సాయంతో ముఖ్య అతిథులుగా డాక్టర్ షరీనా, డాక్టర్ రాజాల ద్వారా భోజనాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ మూలి కిషోర్ రెడ్డి సాయానికి అభినందించారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు గత 9సంవత్సరాలుగా ఆసుపత్రిలో పేద గర్భిణులకు భోజనాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, కిషోర్ రెడ్డి, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, రామమోహన్, కటకం శ్రీను, ప్రభాకర్, వెంకట్, అశోక్, విష్ణు పాల్గొన్నారు.

చంద్రబాబు నాన్ లోకల్ కాదు: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను నాన్ లోకల్ పొలిటీషియన్స్' అని మంత్రి రోజా పేర్కొనడం సరికాదని చంద్రబాబుపుట్టి పెరిగిన నారావారి పల్లెలోనే అని ఆయనకు ఇల్లు ఉండటం కూడా తెలియ కుండా రోజా మంత్రి ఎలా అయ్యారు?' అని ఐటిడి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి గోపీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజాకు మాత్రం రాష్ట్రానికో ఇల్లు కావాలి.. మిగిలిన వారికి హైదరాబాద్ లో ఇళ్లు ఉండ కూడదా?' అని ప్రశ్నించారు. మంత్రి టూరిజంను ఏమి అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

పిఆర్‌టియు కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి- నారాయణవనం: నారాయణవనం ఉన్నత పాఠశాలలో ఎన్నికల అధికారి, పిఆర్‌టీయు రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి ఆధ్వర్యంలో ఆ సంఘం మండల కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులుగా ఏ సుబ్బరాయులు, అధ్యక్షులుగా ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శిగా జానకిరామన్ , మహిళా అధ్యక్షురాలుగా పర్వీన్ బేగం, మహిళా కార్యదర్శిగా జీవితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి టి. సదాశివన్, స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె సులోచన పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి కమిటీ..

యర్రావారిపాలెం: మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, సంఘాలకు సంబంధించి మంగళవారం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎంఎస్పి మండల అధ్యక్షులుగా పల్లిపాక నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా బోయని అంజి ఎన్నికయ్యారు. నియోజకవర్గ కో కన్వీనర్ గా సుండిపల్లి రవిని ఎన్నుకోగా ఎమ్మార్పీఎస్ కార్యదర్శిగా జయేంద్రను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కో ఇన్‌ఛార్జి వెంబడి రాధాకృష్ణ, ఎంఎస్పి జిల్లా కన్వీనర్ త్వరగా అమరనాథ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర, పులిగుంట్ల గోపి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నానికి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నానిని బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. అస్వస్థతకు గురైన నాని తిరుపతి సిమ్స్ లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి ఆయనను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

16న ఎస్వీ గోశాలలో కనుమ గోపూజ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సంక్రాంతి కనుమ పండుగను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ మంగళవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో గోపూజ ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ పూజలు నిర్వహిస్తారు. అనంతరం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి హరిదాసులు, బసవన్నల నృత్యం ఉంటుంది. ఆ తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. మధ్యాహ్నం నుండి శ్రీ వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు.

ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ రమేష్ బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాలల ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఆ సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌కు మద్దతివ్వండి : రిషితారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ లో మంగళవారం 'ఇంటింటికి మీ బొజ్జల'ను నిర్వహించారు. మళ్లీ బొజ్జల కుటుంబానికి అవకాశం ఇస్తేనే శ్రీకాళహస్తి ప్రజలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

టిడిపి నేతల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -రామచంద్రపురం: చంద్రగిరి నియోజకవర్గంలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలగించే హక్కు నీకు ఎవరు ఇచ్చారని టిడిపి మండల అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని రాయల చెరువు కట్ట కింద శ్రీ భవాని శంకరాలయంలో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం మెరుగుపడాలని టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి జనార్దన్ చౌదరి, ఈ ఉమాపతి నాయుడు, కె నర్సింహారెడ్డి,గిరిధర్ రెడ్డి, మాదాసు మాధవయ్య, ధనంజయ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కోరా హరిప్రసాద్, సురేందర్ నాయుడు, రామిరెడ్డి, సి రవికుమార్, సోమురాయిల్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారానికి 'మినీ వారాహి సిద్ధం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికలకు మరో రెండు నెలల గడువు ఉన్న తరుణంలో శ్రీకాళహస్తిలో జనసేన ఎన్నికల ప్రచారానికి ఏర్పాట్లు చేసుకుంటోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా తయారు చేయించుకున్న వారాహి వాహనం లాగానే ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఓ మినీ వారాహి వాహనాన్ని ప్రత్యేకంగా తయారు చేయించుకున్నారు. ఆ వాహనానికి మంగళవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

టీటీడీ ఎస్ డబ్ల్యూఎఫ్ 2024 డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి: టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చేతుల మీదుగా 2024 నూతన సంవత్సరానికి సంబంధించి టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ డైరీని మంగళవారం ఆవిష్కరించారు. దాదాపు 20 సంవత్సరాల నుండి టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో డైరీలు ముద్రిస్తున్నారు. ఈ శుభ సందర్భంగా ఈ సంవత్సరం కూడా టీటీడీ ఎస్ డబ్ల్యు ఎఫ్ ఆధ్వర్యంలో డైరీ ముద్రించారు. ఈ డైరీలో ప్రత్యేకంగా టీటీడీకి సంబంధించిన శ్రీవారి వివిధ సేవల సమాచారం, ఉద్యోగులకు సంబంధించి అనేక సమాచారాలు, నియమ నిబంధనలు పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు గోల్కొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్, కోశాధికారిఎన్ పద్మనాభం, మల్లారపు నాగార్జున, గంపల వెంలాటరమణారెడ్డి, శ్రీలక్ష్మి, ఇందిరా, భాస్కర్ రావు, ఎ నరేష్, డి రవికుమార్, శివయ్య, రమేష్ పాల్గొన్నారు.



టిటిడి ఎస్‌డబ్ల్యూఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

విధి నిర్వహణలో పారదర్శకత లేకుంటే చర్యలు : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : విధి నిర్వహణలో వర్సిటీ సిబ్బంది పారదర్శకత లేకుంటే కఠినమైన చర్యలు తప్పవని వీసీ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో సంస్కరణలపై ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి దృష్టి సారించారు. మంగళవారం ఉదయం తన ఛాంబర్లో పరిపాలనా సంబంధమైన డిప్యూటీ రిజిస్ట్రార్లు, సహాయ పాలనాధికారులతో సమావేశం నిర్వ హించారు. ప్రధానంగా నాలుగు విషయాలపై వారు ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. సమయ పాలన, పారదర్శకత, 24 గంటల్లో ఫైళ్ల క్లియరెన్స్ , పరిపూర్ణ ఇ ఫైలింగ్ వంటి అంశాలపై మాట్లాడారు. మారుతున్న ఆధునికత నేపథ్యంలో, నూతన విధానాన్ని అనుసరిస్తున్న మన విశ్వవిద్యాలయాన్ని అకడమిక్, పాలనా విభాగాలు జోడు గుర్రాల్లా పయనించాలని, విశ్వవిద్యాలయంపై వస్తున్న విమర్శలను తిప్పి కొట్టేలా ప్రతి ఉద్యోగి నిబద్ధత పనిచేయాలని, సెక్షన్ అధిపతి తన కింద పనిచేసే ఉద్యోగుల పనితీరుపై తనకు నివేదిక ఇవ్వాలని కోరారు.

మహిళా వర్సిటీలో ముగిసిన కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం. ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం డిపార్ట్మెంట్ అఫ్ కంప్యూటర్ సైన్స్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ ప్రాజెక్ట్ భాగంగా నాంది ఫౌండేషన్ ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తో సంయుక్తంగా నిర్వహించిన ఏడు రోజుల ఎంప్లాయబులిటీ స్కిల్స్ 'కార్యశాల మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ యన్. రజిని విద్యార్థులను ఉద్దేశించి వారి భవిష్యత్తుకు ఏ విధంగా నైపుణ్యాన్ని వినియోగం చేసుకోవాలని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ విద్యావతి, రిసోర్స్ పర్సన్స్ వై. రజని, ఆయేషా షేక్ , తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

'రవాణా' పేరుతో గ్యాస్ ఏజెన్సీ దోపిడి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రవాణా చార్జీ పేరుతో అధిక మొత్తంలో వసూలు చేస్తూ పేదల నడ్డి విరుస్తున్నారని తహశీల్దారు దస్తగిరయ్యకు దళిత సంఘం నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఒక సిలిండర్‌పై 70 నుంచి 100 రూపాయలు రవాణాచార్జి పేరుతో వసూలు చేయడం దారుణమని దళిత సంఘ నాయకులు పేర్కొన్నారు. నిబంధనలు ప్రకారం గ్యాస్ ఏజెన్సీ వారు సిలిండర్ రవాణా చార్జి 15 కిలోమీటర్ల లోపు ఉంటే రవాణా చార్జీ లేకుండా ఉచితంగా ఇవ్వాలని, 30 కిలోమీటర్లు ఉంటే 30 రూపాయలు మించి వసూలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ 70 నుంచి 100 రూపాయలు వసూలు చేయడం అన్యాయమన్నారు. మండలంలో గ్యాస్ ఏజెన్సీలు పోటీ లేకపోవడంతో ఇష్టానుసారం రవాణా చార్జీలు వసూలు చేస్తూ పేద పేదలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని దళిత సంఘ నాయకులు పేర్కొన్నారు. అధిక రవాణా చార్జీలు వసూళ్లు కొనసాగితే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఇన్‌ఛార్జి పులిచెర్ల మహేష్, మండల ఎంఎస్‌పి నాయకులు పల్లిపాక నాగరాజు, సుండుపల్లి రవి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, శివ, హరీష్, నరేంద్ర, గిరి, శేఖర్, పాపయ్య పాల్గొన్నారు.

తహశీల్దారుకు దళిత సంఘం నాయకుల ఫిర్యాదు



తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న దళిత సంఘం నాయకులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మయూరి శ్యామ్ యాదవ్



అవార్డు అందుకున్న శ్యామ్‌యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీకృష్ణ సేవాసమితి ద్వారా గూడూరు, వివిధ ప్రాంతాలలో 15 సంవత్సరాలుగా బండి శ్యామసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మయూరి శ్యామ్ యాదవ్ చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనకు 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డు అందించారు. ప్రధానంగా విద్య , వైద్యం తో పాటుగా ప్రజలకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కరోనా సమయంలో విరివిగా సేవలందించిన కారణంగా ఈ అవార్డును ఆయన పొందారు. 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' ఫౌండర్, ప్రసిడెంట్ అయిన డాక్టర్ చింతపట్ల వెంకటాచారి ఈ అవార్డును మయూరి శ్యామ్ యాదవ్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మయూరి శ్యామ్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లోనూ తన శక్తి మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

రెండవ దశ 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్: 'ఆడదాం ఆంధ్ర' రెండవ దశ బుధవారం నుండి ప్రారంభం కానున్నాయని వెంకటగిరి మండల ఇంచార్జ్ ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆట స్థలాలను పరిశీలించిన అనంతరం ఇంచార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల నుండి వస్తున్న జట్లకు ఆహ్వానం పలుకుతూ క్రీడాకారులకు వెంకటగిరి పట్టణం లోని విశ్వోదయ కాలేజ్ గ్రౌండ్, ఏపీ రెసిడెన్షియల్ బాలికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సెటిల్ ఆడడానికి వెంకటేశ్వర ప్యాలెస్ దగ్గర ఇండోర్ స్టేడియాలను ఎంపిక చేశామని ఆయా ఆటలను ఇరుజట్లకు టాస్ ద్వారా పోటీలు ఉంటాయని తెలిపారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డికి ప్రజలు మద్దతుగా నిలవాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ లో మంగళవారం 'ఇంటింటికి మీ బొజ్జల' నిర్వహించారు. వైసీపీ పాలనకు, గత టిడిపి ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని సూచించారు.

భూకబ్జాదారుల నుంచి ఆదుకోవాలి..

బాధితుల అభ్యర్థన

పజాశక్తి తిరుపతి సిటీ: తల్లిదండ్రుల నుంచి పసుపు కుంకాలులో భాగంగా తమకు సంక్రమించిన ఆస్తిపై కొంతమంది కబ్జాదారులు ఆక్రమణకు దిగారని, వారి నుంచి తమ ఆస్తులను కాపాడాలని బాధితులు జ్యోతి, సీకే హేమ, హెసీబా, పాలస్టిన్ వేడుకున్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ అక్కారాంపల్లి సర్వే నెంబర్ 11/2బి2 25 సెంట్లు భూమిని, కిరణ్ కుమార్ నుంచి తమ తల్లిదండ్రులు జ్యోతి, సికే అగస్టన్ 2005లో కొనుగోలు చేశారన్నారు. ఆ తర్వాత ముగ్గురు కుమార్తెలకి పసుపు కుంకాలు కింద దాన్ని పంచారని, ఉద్యోగరీత్యా తాము బయట ప్రాంతాల్లో ఉంటున్నామని, ఇటీవల కొంత మంది తమ స్థలంలోకి ప్రవేశించి, తాను జర్నలిస్టు అంటూ, ఈ స్థలం తనది అని పేర్కొన్నారు. తాము దళితులు కావడం తో, 'మీరు నన్ను ఏమి చేయలేరు' అని కులం పేరుతో దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని, రెవెన్యూ రికార్డులను సైతం సమర్పిం చామని తెలిపారు. కానీ కొంతమందిని తీసుకొచ్చి, తాము కట్టిన ఇంట్లో కాపురం పెట్టి , ఈ స్థలం మాది' అని తమపై దాడికి దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని కోరారు.

ఓటు హక్కును తొలగించే హక్కు ఎవరిచ్చారు?: టిడిపి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: 'చంద్రగిరి నియోజకవర్గంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలగించే హక్కు నీకు ఎవరు ఇచ్చారు?' అని టిడిపి మండల అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ భవాని శంకరాలయంలో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం మెరుగుపడాలని టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 40,000 ఓట్లకు పైగా అధికారులని అడ్డం పెట్టుకుని, పి ఎల్ వో లను బెదిరించి వారి లాగిన్లలో దొంగ ఓట్లను నమోదు చేయించడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సి జనార్దన్ చౌదరి, ఈ ఉమాపతి నాయుడు, కె నర్సింహారెడ్డి, గిరిధర్ రెడ్డి, మాదాసు మాధవయ్య, ధనంజయ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కోరా హరిప్రసాద్, సురేందర్ నాయుడు, రామిరెడ్డి, సి రవికుమార్, సోమురాయిల్ , కార్యకర్తలు పాల్గొన్నార

సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రతిభ



టాపర్ గా నిలిచిన హరినాథ రెడ్డి.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళవారం సీఏ ఇన్స్టిట్యూట్, న్యూఢిల్లీ విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్లు ఇ. గిరిధర్ రెడ్డి, కె.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. సిఏ ఇంటర్ ఫలితాల్లో ఎ.హరినాథ రెడ్డి 441 మార్కులతో టాపర్ గా నిలిచారని, జె.రేవతి, కె.యశ్వంత్, టి.రాజశేఖర్, జె.మునిమోహిత్, డి.అమత్యా, ఎస్ వి. శ్రావ్య సీఏ ఇంటర్ పూర్తి చేశారన్నారు. డి. దామోదర్, పి.హువేజ్ ఖాన్, కె.పుష్పేంద్ర రెడ్డి, సి.మాధురి తదితరులు అత్యుతమ మార్కులు సాధించారన్నారు. ఎమరాల్డ్స్ విద్యార్థులు 51.47 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని డైరెక్టర్స్ అభినందించారు.

క్రికెట్లో గేట్ పుత్తూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎనిమిదో తేదీ 67వ ఎస్ జి ఎఫ్. విభాగంలో,17 సంవత్సరాల బాలుర విభాగలు నర్సారావు పేటలో నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో జిల్లా పరిషత్ గేట్ విద్యార్థి సిద్దు అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో బీహార్ రాష్ట్రంలో జరిగే పోటీలకు ఎంపికై అయినందుకు రాష్ట్ర మంత్రి ఆర్ కె రోజా అభినందనలు తెలిపారు . క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికైనందుకు పలువురు ప్రశంసించారు.

'ఆరోగ్య సురక్ష'తో వైద్య భరోసా

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ వైద్య భరోసా కల్పిస్తున్నట్లు కొట్టాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివాజీ ప్రయాగ్ అన్నారు. చంద్రగిరి మండలం కల్ రోడ్ పల్లి సచివాలయంలో కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివాజీ ప్రయాగ్ ఆధ్వర్యం లో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధారాణి, సిహెచ్ఓ ప్రతిభ, ఎంపీహెచ్ఇఒ ఈశ్వరయ్య, పిహెచ్ఎన్ రమణమ్మ, ఎంపిహెచ్ఎస్ లలితమ్మ, వెంకటేష్,వాసుదేవ, ఏయన్ యంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండవ విడత కార్యక్రమం దొరవారిసత్రం మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం ఏర్పాటు చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి చైతన్య రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పిలు, సూపరువైజర్సు, ఏఎన్ఎంలు, హెల్త్అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

'సిపాయి భరోసా' అందజేత

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేట హరిజనవాడలో మృతిచెందిన యానాది బోడయ్య, కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం కలిశారు. బోడయ్య భార్య శంకరమ్మ కి సిపాయి భరోసా కింద 40 నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు, డాక్టర్ వెంకటాద్రి, డాక్టర్ శీను పాల్గొన్నారు.

మామిడిలో త్వరగా పూత రావటానికి హార్మోన్లు వాడాలి -జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మామిడి తోటలో త్వరగా పూత రావడానికి తగిన హార్మోన్లను వాడాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి అన్నారు.మంగళవారం చంద్రగిరి మండలం ఐతేపల్లిలో పలువురు రైతులకు సంబంధించిన మామిడి తోటలను తిరుపతి చీనీ ,నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగరాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి చెట్లలో పూత ఆశించినంతగా రావడానికి సక్రమంగా ప్రూనింగ్ చేయటం ఎరువులు తగిన మోతాదులో వాడటం రాత్రి పగలు కాలాల్లో సంభవించే ఉష్ణోగ్రతల తేడాలే కారణం గా అన్నారు. పాక్లో బుట్రోజోల్ వాడినప్పుడు ఎక్కువగా నీటితడులు ఇవ్వాలని, ఎరువులు రెట్టింపు మోతాదులో వాడాలని లేకుంటే చెట్లు ఎండిపోయే ప్రమాదముందన్నారు. శాఖియా మొగ్గలు కొత్తగా మారటానికి పూత మగ్గిపోకుండా ఉండటానికి తీసుకోవాల్సిన సస్యరక్షణ గురించి వివరించారు. అనంత గుర్రప్ప గారి పల్లెలో రైతు సహకార సంఘం నిర్మించుకుంటున్న మామిడి సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారి శైలజ, రైతు భరోసా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర స్ఫూర్తితో ముందుకు సాగుదాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నారాయణవనం: ఎన్నికల ముందు జగన్ చేపట్టిన 'ప్రజా సంకల్పయాత్ర ' స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు నిచ్చారు. ప్రజా సంకల్ప యాత్ర ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బైపాస్ కూడలి వద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేకును కట్ చేయించి నాయకులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల కన్వీనర్ సొరకాయలు, జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్, డిసిసి డైరెక్టర్ ఊరప్ప, కోనేటి బాబు, సర్పంచులు, నాయకులు, ప్రజాప్రతి నిధులు, వైసిపి అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉగ్గుమూడి గురునాధం రవిరెడ్డి , సోషల్ మీడియా కో కన్వీనర్ ప్రసాద్ పాల్ , గురవయ్య , గురప్పనాయుడు, బాబు నాయుడు, సాయి నాయుడు, జయచంద్రనాయుడు, హరి నాయుడు, గిరి, ఆటో యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన నిందితులు

గంజాయి పట్టివేత
నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట సెబ్ పోలీసుల తనిఖీలలో మూడు లక్షల 15 వేల రూపాయలు విలువచేసే 21 కేజీల గంజాయి రవాణా చేస్తున్న బెంగళూరుకు చెందిన నలుగురు యువకులను అరెస్ట్ చేశారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర ఆదేశాలనుసారం నాయుడుపేట సెబ్ సీఐ ఆర్‌యువిఎస్ ప్రసాద్ తమ పోలీసులతో తనిఖీలు నిర్వహించగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురు యువకులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయి పట్టుకున్నారు. గూడూరు సెబ్ డిఎస్పి జె రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నిందితుల వివరాలు ప్రకారం విశాఖపట్నంకి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి కేజీ 6 వేలరూపాయలకు కొనుగోలు చేసి బెంగళూరుకు తరలించి అక్కడ కేజీ 15 వేల రూపాయలతో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారని, వీరు నలుగురు బెంగళూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారని విచారణలో తెలిసిందని సీఐ ఆర్‌యువిఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ సుకుమార్, కానిస్టేబుల్స్ పి వెంకటేశ్వర్లు, సిహెచ్ రమణయ్య, డి వెంకటేశ్వర్లు, సుబ్బయ్య పాల్గొన్నారు. డీఎస్పీ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

దొంగతనం కేసులో వ్యక్తికి ఆరు నెలలు జైలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : దొంగతనం కేసులో ఓ నేరస్తుడికి తిరుపతి కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా మీడియాతో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2018లో తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో భాస్కర్ నాయుడు అనే ఒక విశ్రాంత పోలీస్ అధికారి ఇంట్లో రాత్రిపూట చోరీ జరిగింది. ఓ వ్యక్తి అక్రమంగా ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డాడని అందించిన ఫిర్యాదు అందించారు. (సిఆర్ నెంబరు.124/ 2018 యు/ఎస్ 457, 380 ఐపిసి) కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ కేసులో తమిళనాడు తిరువూరు జిల్లాకు చెందిన నిందితుడు చెన్నై కుమార్‌ను అరెస్టు చేసి, కోర్టులో చార్జ్ షీటు ను తిరుచానూరు పోలీసులు దాఖలు చేశారు. కోర్టులో కేసు విచారణలో నేరం నిరూపణ అవడంతో తిరుపతి ఏజెసిజె, జడ్జి నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో దొంగను గుర్తించడంలో విశేష కృషి చేసిన తిరుచానూరు సిఐ శివ ప్రసాద్ రెడ్డి, దర్యాప్తు అధికారులు సుబ్రహ్మణ్యం రెడ్డి (ప్రస్తుత తిరుపతి రూరల్ సీఐ), రాజశేఖర్(ప్రస్తుత సెబ్ సీఐ), రామాంజనేయులు (అప్పటి ఎస్సై), కోర్ట్ కానిస్టేబుల్ సుమన్ ని జిల్లా ఎస్పీ అభినందించారు. మిగిలిన కేసులలోనూ నేర నిరూపణ చేసి నేరస్తులను శిక్షించేందుకు కృషి చేయాలన్నారు.

నాలుగు లారీలు ఢీ-ఒకరు మృతి

విశాలాంధ్ర-తడ: తడ మండలం లోని కారూరు మిట్ట గ్రామ సమీపంలోని ఆంధ్ర తమిళనాడు మత్స్యకారుల సంఘం కార్యాలయం వద్ద నాలుగు లారీలు ఒకదానిని మరొకటి ఢీకొన్న ప్రమాదంలోయన్ క్రిష్ణ న్ (53) మృతి చెందగా మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు..మహేశ్వరీ ట్రాన్స్ పోర్టుకు సంబంధించిన ఆయిల్ ట్యాంకర్ లారీని సెల్వం , క్రిష్ణన్ డ్రైవర్ లుగా పని చేస్తున్నారు. సోమవారం చెన్నై లోని తండయార్ పేట లో ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన బేస్ ఆయిల్ తీసుకుని నాగ్ పూర్ వెళుతుండగా అతి వేగంతో లారీని నడిపి అదే మార్గంలో ముందు వెళుతున్న టిప్పర్ ని వెనుక నుండి వేగంగా ఢీకొంది. ఆ టిప్పర్ లారీ ముందు వెళుతున్న మరో ఐచర్ మినీ లారీని ఢీ కొట్టగా ఐచర్ లారీ దాని ముందు లారీని ఢీ కొట్టింది. అంతేకాక ముందు ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్ మళ్లీ దూసుకు వెళ్లి ముందువుండే ఐచర్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో క్రిష్ణ న్ అక్కడికక్కడే మృతి చెందగా సెల్వం, గౌస్, కరీమ్ లకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ దుర్ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగినట్లు తెలిపారు. తడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'భాష్యం' లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్థానిక న్యూ బాలాజీ కాలనీ లో ఉన్న భాష్యం పాఠశాలలో జోనల్ ఇన్‌ఛార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చాటారు. విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దులు, సోదమ్మ మాటలు, సంక్రాంతి నృత్యాలతో అలరించారు. భోగి మంటలు, సంక్రాంతి పొంగళ్ళు, పశువుల అలంకరణలు, గాలిపటాలు ఎగరవేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదు రోజులు ముందే సంక్రాంతి పండుగ వాతావరణంతో భాష్యం కళకళలాడింది ఇందులో భాగంగా రంగవల్లుల పోటీలో గెలిచిన మహిళలకు పట్టుచీరలు బహుమానంగా అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్స్, లిటిల్ చాంప్స్ ఇన్‌ఛార్జిలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



భాష్యం స్కూలులో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం